# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

శుక్రవారం | 15 ఆగస్టు 2025 | పేజీలు 8


## రామచందర్‌రావు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో ఏ రాష్ట్రంలోనూ యూరియా కొరత లేదని, రాష్ట్ర ప్రభుత్వమే కృత్రిమ కొరత సృష్టిస్తోందంటూ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చేసిన వ్యాఖ్యలు ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తాను స్వయంగా రెండు సార్లు కేంద్రమంత్రి జేపీ నడ్డాను కలిసి రాష్ట్రానికి కేటాయింపులకు అనుగుణంగా యూరియా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేసినా ఫలితం లేదన్నారు. రాష్ట్రానికి కేంద్రం


-2 లో




- ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక సీనియర్ అధికారుల కేటాయింపు..
- సెలవుల్లో ఉన్న అధికారుల, సిబ్బంది వెనక్కి రావాలని కలెక్టర్ పిలుపు..
- భారీ వర్షాలు, సహాయక చర్యలపై కలెక్టర్‌లు ఎస్పీలతో మంత్రి పొంగులేటి..
- రెవెన్యూ,విపత్తుల నిర్వహణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వీడియో కాన్ఫరెన్స్..

## రాగల 24 గంటలు... అప్రమత్తంగా ఉండాలి

### వరద సహాయక చర్యలకై జిల్లాకు రూ.కోటి మంజూరు..




**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 14:** రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపధ్యంలో జిల్లా కలెక్టర్‌లు, జిల్లా ఎస్పీలు, పోలీస్ కమీషనర్లు మరింత అప్రమత్తంగా ఉండి ఏలాంటి ప్రాణ నష్టం, ఆస్థి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ. గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. గడచిన మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని వీటిని దృష్టిలో పెట్టుకొని రాగల 24 గంటలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు..

-2లో

## ప్రమాదకరస్థితికి తెలంగాణ ద్రవ్యోల్బణం



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో ద్రవ్యోల్బణం ప్రమాదకర స్థితికి చేరుకుందన్నారు. ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో వెళ్తోందనడానికి ఇదో ప్రమాదకర సంకేతమని.. రేవంత్ ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తోందని ఆక్షేపించారు. ప్రభుత్వ తప్పిదాలే దీనికి కారణమన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు. "ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదు. ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవాలంటే ప్రజల చేతుల్లో డబ్బు అందుబాటులో ఉంచాలి.

-2 లో

### ఎన్‌సిసి క్యాడెట్స్ ఆధ్వర్యంలో.. దేశభక్తిని చాటుతూ సైకిల్ ర్యాలీ..

పేట్ బషీరాబాద్ సెయింట్ ఆన్స్ హైస్కూల్ లో 79వ స్వాతంత్ర్య దినోత్సవం..

-3లో

## వికారాబాద్‌లో భూ ప్రకంపనలు.. రిక్టర్ స్కేలుపై 3.8 తీవ్రత నమోదు




**హైదరాబాద్ పెన్ పవర్:** వికారాబాద్ జిల్లాలో ఉదయం భూమి స్వల్పంగా కంపించింది. తెల్లవారుజామున ఒక్కసారిగా భూమి కంపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఒకవైపు కుండపోత వర్షాలు అల్లకల్లోలం చేస్తున్న సమయంలో భూమి కంపించడంతో ఎటు పరుగులు తీయాలో అర్థంకా ప్రజలు ఆందోళన చెందారు. పరిగి పరిసర ప్రాంతాల్లో భూమిని సుమారు 3 సెకన్ల పాటు కంపించింది. రంగాపూర్, బసిపల్లి, న్యామత్‌నగర్‌లో భూమి కంపించింది. ఈ ప్రకంపనల తీవ్ర రిక్టర్ స్కేలుపై 3.8గా నమోదైంది.

పెన్ పవర్ 15 శుక్రవారం, ఆగస్టు 2025

# రాగల 24 గంటలు.. అప్రమత్తంగా ఉండాలి..

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యంగా హైదరాబాద్ నగరంతో పాటు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టరు మను చౌదరి, జిల్లా డిసిపి పద్మజా, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ పాల్గొన్నారు. జిల్లా కలెక్టరు మాట్లాడుతూ నిన్నటి నుండి జిల్లా తక్కువ వర్షపాతం నమోదయ్యిందని, జిల్లాలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడంతో పాటు,గురువారం జిల్లాలో పాఠశాలలకు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. ఆర్ అండ్ బి, ఇరిగేషన్, మెడికల్, పోలీస్, మత్స్య, తదితర శాఖ అధికారులను అప్రమత్తం చేశామని అన్నారు..







రైల్వే లైన్లు, లోలెవెల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వర్షం నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా లోలెవెల్ బ్రిడ్జీల దగ్గర పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.. చిన్న చిన్న వర్షాలు 200 మిల్లీమీటర్లకే బ్యాక్ వాటర్ వల్ల అక్కడున్న ప్రజలను తరలించవలసి వస్తుందని దీనికి శాశ్వత పరిష్కారం కోసం అక్కడున్నవారిని తరలించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు..

## ఒక్కో జిల్లాకు రూ.కోటి నిధులు విడుదల..

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవలసిన సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు కోటి రూపాయిలు విడుదల చేశామని అవసరమైతే మరిన్ని నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు గాను ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించనున్నట్లు తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కు పిలిపించాలని, వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు.. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ లో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు..

- మొదటి పేజి తరువాయి
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సూచనల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై తెలంగాణ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ రావుతో కలసి గురువారం, సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్‌లు, జిల్లా ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.. గడచిన 24 గంటల్లో 10 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ తదితర జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాబోయే 24 గంటల్లో రెడ్ అలెర్ట్‌గా ఉన్నమెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలలో తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్లను అప్రమత్తం చేశారు..

# రామచందర్‌రావు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

- మొదటి పేజి తరువాయి
ఎంత యూరియా కేటాయించింది? ఎంత సరఫరా చేసింది? అనే వాస్తవాలను ముందుగా రామచందర్‌రావు తెలుసుకోవాలని సూచించారు. కేవలం తెలంగాణలోనే కాదు..పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో కూడా యూరియా కొరత ఉందని తెలిపారు. భాజపా రైతు మిత్ర ప్రభుత్వం కాదని, రైతు వ్యతిరేక ప్రభుత్వం

అని ధ్వజమెత్తారు. ఈ మేరకు మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్రం.. రాష్ట్ర అవసరాలకు మించి యూరియా ఇచ్చిందని, తెలంగాణ ప్రభుత్వం రైతులకు పంపిణీ చేయలేకపోయిందని విమర్శించడం శోచనీయం, అర్ధరహితమని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఆరోపణలు తెలంగాణ భాజపాకి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తున్నాయని ఆక్షేపించారు.

## ప్రమాదకరస్థితికి తెలంగాణ ద్రవ్యోల్బణం

- మొదటి పేజి తరువాయి
ప్రభుత్వ మూలధన పెట్టుబడి నిరంతరం తగ్గుతోంది. మూసీ, హైడ్రా వంటి నిర్ణయాలు రియల్ ఎస్టేట్ రంగాన్ని దెబ్బతీశాయి. వేలాది మంది ఉపాధి అవకాశాలపై ఇవి ప్రతికూల ప్రభావం చూపాయి. ప్రధాన ప్రాజెక్టులు చేపట్టడం, ప్రజలకు డబ్బు అందుబాటులోకి తీసుకురాకపోవడం చేస్తే ద్రవ్యోల్బణం మరింతగా దిగజారి మాంద్యంలోకి వెళ్లే ప్రమాదముంది. సీఎం రేవంత్‌రెడ్డి మేలుకోవాలి.. ప్రతీకార రాజకీయాలు కాకుండా ప్రజల గురించి ఆలోచించాలి” అని హరీశ్‌రావు అన్నారు.

# తొలగించిన 65 లక్షల ఓటర్ల లిస్టు ఇవ్వండి: ఎలక్షన్ కమిషన్‌కు సుప్రీంకోర్టు ఆదేశం




**హైదరాబాద్ పెన్ పవర్:**బీహార్ ఓటర్ జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై కీలక నిర్ణయం ప్రకటించింది సుప్రీంకోర్టు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల లిస్టును ప్రజలకు ముందుంచాలని ఆదేశించింది.. అది కూడా బీహార్ ఎన్నికలకు ముందే ప్రకటించాలని కోరింది.ఎన్నికలు జరగనున్న బీహార్ లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై గురువారం(ఆగస్టు14) విచారణ చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం బాధిత ఓటర్లకు వారి తొలగింపు గురించి తెలుసుకునేలా తొలగించిన ఓటరల్ లిస్టును ప్రకటించాలని ఆదేశించింది. వార్తాపత్రికలు, టెలివిజన్ ,సోషల్ మీడియా ద్వారా తొలగింపుల విస్తృత ప్రచారం కల్పించాలని ఎన్నికల సంఘానికి సూచించింది. ఈ ప్రక్రియను వచ్చే మంగళవారం(ఆగస్టు 19) నాటికి ఈ దశలను పూర్తి చేయాలని కమిషన్‌ను కోరింది. SRI పారదర్శకతపై పెరుగుతున్న ఆందోళనలు, బీహార్ ఎన్నికలపై SIR ప్రభావం చూపుతుందన్న ఆరోపణల మధ్య సుప్రీంకోర్టు ఈ కీలక ఆదేశాలిచ్చింది. ఓటింగ్ కు ముందు ప్రజలకు అందుబాటులో ఉండేలా పూర్తి జాబితాను తన అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం కోరింది. సవరణ ప్రక్రియ న్యాయబద్ధత, ఖచ్చితత్వంపై ప్రశ్నలు తలెత్తుతున్న తరుణంలో రాజకీయ పార్టీలు, పౌర సమాజ సంఘాలు ,ప్రభావిత వ్యక్తులు తొలగింపులను పరిశీలించేందుకు వీలు కల్పిస్తుందని భావిస్తున్నారు.

బాధిత ఓటర్లకు వారి తొలగింపు గురించి తెలుసుకునేలా వార్తాపత్రికలు, టెలివిజన్,సోషల్ మీడియా ద్వారా తొలగింపుల విస్తృత ప్రచారం కల్పించాలని జస్టిస్ సూర్యకాంత్ ,జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈసీని ఆదేశించింది.ఓటరు లిస్టులో పేరు తొలగించబడిన వ్యక్తులు తమ అభ్యంతరాలను తెలపవచ్చని కోర్టు సూచించింది. ప్రూఫ్ లుగా ఆధార్ కార్డులను కూడా చూపించవచ్చని తెలిపింది. వచ్చే మంగళవారం(ఆగస్టు 19) నాటికి ఈ దశలను పూర్తి చేయాలని కమిషన్‌ను కోరింది.

### బీహార్ SIRకి సవాళ్లపై విచారణ

అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ADR) దాఖలు చేసిన దానితో సహా బీహార్‌లో SIR తీరును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించింది అత్యున్నత న్యాయస్థానం. విచారణ సమయంలో తొలగించబడిన ఓటర్ల జాబితాను ప్రకటించడంతో పాటు తొలగింపుకు గల కారణాలను బహిరంగపరచాలని ADR కోర్టును కోరింది. తదుపరి విచారణను ఆగస్టు 22 కు వాయిదా వేసింది సుప్రీంకోర్టు.

# ఎన్‌సిసి క్యాడెట్స్ ఆధ్వర్యంలో.. దేశభక్తిని చాటుతూ సైకిల్ ర్యాలీ..

## పేట్ బషీరాబాద్ సెయింట్ ఆన్స్ హైస్కూల్ లో 79వ స్వాతంత్ర్య దినోత్సవం..






**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఆగష్టు 14:** భారత జాతి గౌరవాన్ని, దేశభక్తిని చాటే విధంగా, ఎన్‌సిసి క్యాడెట్స్ తిరంగ ర్యాలీని ఘనంగా నిర్వహించారు.. నేడు స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని, పెట్ బషీరాబాద్‌లోని సెయింట్ ఆన్స్ హైస్కూల్ (సిఐఎస్‌సిఇ) ఆధ్వర్యంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఒకరోజు ముందుగానే, దేశభక్తితో, సమాజ ఆధారిత కార్యకలాపాలతో ఘనంగా జరుపుకుంది. 2(టి) బెటాలియన్ ఎన్‌సిసి, కమాండింగ్ ఆఫీసర్ విభాస్ గుప్తా మార్గ దర్శకత్వంలో, పాఠశాల ఫిట్‌నెస్ మరియు జాతీయ గౌరవాన్ని ప్రోత్సహించడానికి సైకిల్ ర్యాలీ నిర్వహించారు.. ఫుట్ ర్యాలీని, సృజనాత్మకత మరియు జ్ఞానాన్ని ప్రోత్సహించడానికి పెయింటింగ్ పోటీ, క్విజ్ పోటీని మరియు పర్యావరణ అవగాహనను వ్యాప్తింప చేయడానికి ప్లాంటేషన్ డ్రైవ్‌ను నిర్వహించింది.. మొత్తం 580 ఎన్.సిసి క్యాడెట్‌లు, వారి అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్లు (ఎఎన్‌ఓలు) ఈ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు, క్రమశిక్షణ, జట్టుకృషి మరియు ఉత్సాహాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, పౌరుల బాధ్యత మరియు పర్యావరణ పరిరక్షణకు, నాయకత్వ భావాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని అన్నారు.. ఈ వేడుకల్లో పాఠశాల నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.. ఈ స్వాతంత్ర్య దినోత్సవం సంబరాల్లో పాల్గొన్న ఎన్‌సిసి క్యాడెట్‌లు పలువురి ప్రశంసలు పొందారు.. భారతదేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి త్యాగాలను గౌరవిస్తూ, భారతదేశ పౌరులు అందరు ఐక్యత, సేవాభావంతో మెదులుకోవాలని పాఠశాల ముఖ్యులు తెలిపారు.. దేశ వారసత్వం పట్ల గౌరవం, విలువలను గుర్తుచేశారు...



# పొద్దుపొద్దున్నే వేడి వేడి కాఫీ తాగుతున్నారా.. : ఇలాంటి వారు హ్యాపీగా ఎక్కువ రోజులు బతుకుతారంట..!



**హైదరాబాద్ పెన్ పవర్:**కొంత మందికి పొద్దున్నే లేవగానే కప్పు కాఫీ తాగాల్సిందే... అయితే కాఫీ తాగడం మన శరీరానికి శక్తి వస్తుంది. కానీ ఉదయం పూట మాత్రమే కాఫీ తాగితే అది మన ఆరోగ్యానికి ఇంకా చాలా మేలు చేస్తుందని, ఎక్కువ కాలం జీవించడానికి కూడా సహాయపడుతుందని కొత్త అధ్యయనాలు చెబుతున్నాయి.

యూరోపియన్ హార్ట్ జర్నల్‌లో వచ్చిన ఒక పరిశోధన ప్రకారం అమెరికాలో 40 వేల మందిపై డాక్టర్లు క్వి అనే వ్యక్తి రీసర్చ్ చేశారు. ఈ పరిశోధనలో కాఫీ తాగే సమయం మన ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో గమనించారు. రీసర్చ్ ఎం చెబుతుందంటే : కేవలం ఉదయం పూట మాత్రమే కాఫీ తాగే వారికి అసలు కాఫీ తాగని వారితో పోలిస్తే ఏ కారణంగానైన చనిపోయే ప్రమాదం 16 శాతం తక్కువగా ఉంటుంది. ఇంకా గుండె జబ్బుల వల్ల చనిపోయే ప్రమాదం 31 శాతం తక్కువగా కూడా. అయితే, రోజంతా కాఫీ తాగే వారికి ఈ ప్రయోజనాలు ఉండవు. అందుకే ఉదయం పూట మాత్రమే కాఫీ తాగితే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

**ఉదయం కాఫీ తాగడానికి కారణాలు:**

లిఉదయం కాఫీ తాగడం వల్ల మన శరీరం సరిగ్గా పనిచేస్తుంది. నిద్ర, జీర్ణక్రియ, హార్మోన్ల బ్యాలెన్స్ కాపాడుతుంది. సాయంత్రం లేదా రాత్రి పూట కాఫీ తాగితే వీటిని దెబ్బతినే అవకాశం ఉంది.

ఈ రీసర్చ్ ప్రకారం ఉదయం మాత్రమే కాఫీ తాగే వారికి గుండె సంబంధిత వ్యాధులు లేదా ఇతర ఆరోగ్య సమస్యల వల్ల చనిపోయే ప్రమాదం తక్కువ. ఇది ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించడానికి సహాయపడుతుంది.

మీరు సాయంత్రం 4 గంటల తర్వాత కాఫీ తాగినా కూడా దానిలో ఉన్న కెఫీన్ రాత్రి నిద్రపోయేటప్పుడు మీ శరీరంలో ఉండిపోతుంది. దీని వల్ల గాఢ నిద్ర దెబ్బతిని మీ శరీరం సరిగ్గా విశ్రాంతి తీసుకోలేదు.

ఉదయం కాఫీ తాగడం వల్ల మనసు ప్రశాంతంగా ఉండి పనిపై ఎక్కువ దృష్టి పెట్టొచ్చు. కానీ మధ్యాహ్నం లేదా సాయంత్రం కాఫీ తాగితే ఆందోళనగా లేదా చికాకుగా అనిపించవచ్చు.

లిఉదయం మాత్రమే కాఫీ తాగడం వల్ల ఎక్కువగా తాగే అలవాటు తగ్గుతుంది. దీనితో పాటు అనవసరంగా స్నాక్స్ తినకుండా ఉండవచ్చు. మీరు కాఫీ ఎంత తాగుతారు, ఎప్పుడు తాగుతారు అనే దాని గురించి కూడా పరిశోధకులు పరిశీలిస్తున్నారు.

# ఇది విన్నారా.. ఐ ఫోన్ హ్యాక్ చేస్తే రూ.17.5 కోట్లు ఇస్తారంట.. యాపిల్ స్వయంగా ప్రకటించింది !

**భద్రతా లోపాలు కనుగొనడమే లక్ష్యం**

**ఎథికల్ హ్యాకర్లు లోపాలునివేదించాలన్న సంస్థ**

**క్వాలిటీ విషయంలో సీరియస్‌గా వ్యవహరిస్తున్న కంపెనీ**




**హైదరాబాద్ పెన్ పవర్:** భద్రత విషయంలో అగ్రస్థానం లో ఉన్న ఆపిల్ కంపెనీ తన ఉత్ప త్తుల క్వాలిటీ విషయాన్ని చాలా సీరియస్ గా తీసుకుంటోంది. ఈ విషయాన్ని మరోసారి నిరూపించుకునేందుకు ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. ఐఫోన్, ఐ ప్యాడ్, మ్యాక్ బుక్ ల్యాప్ టాప్స్ సహ తమ కంపెనీ తయారు చేసే అన్ని ఉత్ప త్తులను హ్యాక్ చేయగలిగితే కోట్ల రూపాయలు బౌంటీ రివార్డ్స్ ఇస్తా మని బహిరంగ ప్రకటన చేసింది.

ఈ కార్యక్రమం ద్వారా ఎథికల్ హ్యాకర్లు ఆపిల్ ఉత్పత్తులలో ఉన్న లోపాలను కనుగొని, తమకు నివేదించేందుకు అవకాశం కల్పిస్తుంది. ఈ లోపాలను కనుగొన్న వారికి ఆపిల్ భారీ నగదు బహుమతులను అందిస్తుంది. ఈ బహుమతులు కనీసం రూ. 4 లక్షల నుంచి 17.5 కోట్ల రూపాయల వరకు ఉంటాయి. ఐదు విభాగాలుగా బహుమతులను విభజించింది. విభాగాల ఆధారంగా బహుమతి మారుతుంది.

**ఫిజికల్ యాక్సెస్**

హ్యాకర్ ఐఫోన్ ను ఫిజికల్ గా పట్టుకొని దానిలోని లోపాలను ఉపయోగించుకోవాలి. ఉదాహరణ కు లాక్ స్క్రీన్ ను బైపాస్ చేస్తే రూ.83 లక్షల వరకు లభిస్తుంది. లాక్ చేసిన ఫోన్ నుంచి యూజర్ డేటాను తీసుకుంటే రూ.2 కోట్లు బహు మతిగా ఇస్తామని తెలిపింది.

**ఇన్‌స్టాల్ చేసిన యాప్ ద్వారా**

యూజర్ ఇన్‌స్టాల్ చేసిన యాప్స్ ద్వారా లోపాలను ఉపయోగించుకోవాలి. ఈ రకమైన హ్యాకింగ్ కు రూ. 4 లక్షల నుంచి 1.25 కోట్ల వరకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపింది.

**యూజర్ ఇంటరాక్షన్ నెట్‌వర్క్ పై**

యూజర్ ఇంటరాక్షన్ ద్వారా అనధికార యాక్సెస్ లేదా ప్రివిలేజ్ ఎలివేషన్ జరుగుతుంది. ఒక క్లిక్ తో డేటా యాక్సెస్, అథెంటిసిటీ పొందితే రూ. 2,18,90,137 వరకు బహుమతి లభిస్తుంది.

**ప్రైవేట్ క్లౌడ్ కంప్యూట్ డేటాపై**

ఆపిల్ ప్రైవేట్ క్లౌడ్ లో డేటాను టార్గెట్ చేస్తే సుమారు ?1.25 కోట్లు లభిస్తుంది. రిమోట్ గా దాడి చేసి లాక్ డౌన్ మోడ్ ను బైపాస్ చేస్తే ?17.5 కోట్లు బహుమతి పొందవచ్చు.

**యూజర్ ఇంటరాక్షన్ లేని నెట్ వర్క్**

యూజర్ ఇంటరాక్షన్ లేని నెట్ వర్క్ దాడులను “జీరోక్లిక్” అటాక్స్ గా పిలుస్తారు. ఉదాహరణకు, ఆపిల్ కెర్నల్ పీఏసీ ప్రొటెక్షన్ ను బైపాస్ చేస్తే 8.3 కోట్ల రూపాయల బహుమతి పొందవచ్చు.

# 8 రూపాయల చిల్లరను కోటి చేసిన క్రిప్టో.. బిట్‌కాయిన్ లాభాల మ్యాజిక్..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ వ్యాప్తంగా సంచలనంగా మారిన ఏకైక పెట్టుబడి ప్రస్తుతం క్రిప్టో. ఇందులోనూ ప్రధానంగా హాట్ కేకులా అమ్ముడుపోతున్నది బిట్‌కాయిన్ మాత్రమే. అవును దీనిని 2009లో సతోషి నకమోటో అనే వ్యక్తి దాదాపు సున్నా విలువతో ప్రారంభించాడు. కానీ ఇవాళ ఒక్కో బిట్‌కాయిన్ రేటు ఏకంగా కోటి రూపాయలు దాటేసింది. అంటే దీనిని ప్రారంభించినప్పుడు ఒక్క రూపాయి పెట్టుబడిగా పెట్టి ఉంటే ప్రస్తుతం కోటీశ్వరులుగా మారారు కొందరు ఇన్వెస్టర్లు. 2010లో బిట్‌కాయిన్ తన ర్యాలీని స్టార్ట్ చేసింది. అప్పట్లో ఒక్కో కాయిన్ రేటు జస్ట్ రూ.8 మాత్రమే. కానీ 2013 నాటికి దాని విలువ వెయ్యి డాలర్లు అంటే 87వేల రూపాయలకు పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా క్రిప్టోలకు వస్తున్న ప్రత్యేక గుర్తింపు.. అమెరికా, లండన్, థాయిలాండ్ వంటి దేశాల్లో క్రిప్టో ఈటీఎఫ్ లకు వస్తున్న గుర్తింపు ఇన్వెస్టర్లను ఆకట్టుకుంటోంది. పైగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ క్రిప్టోలకు అనుకూలంగా పాలసీలను రూపొందించటం.. అలాగే ఆయన ఫ్యామిలీ కూడా క్రిప్టోల వ్యాపారంలో ఉండటంతో ఆధునిక కాలంలో ఇదొక ప్రత్యేక అసెట్ క్లాస్ గా గుర్తింపును దక్కించుకుంటోంది.

ప్రధానంగా క్రిప్టో కరెన్సీలు బ్లాక్ చెయిన్ టెక్నాలజీపై పనిచేస్తుంటాయి. అందుకే దీనిని డిజిటల్ ప్రపంచంలో బంగారంగా పిలుస్తుంటారు. ప్రస్తుతం క్రిప్టోలపై బ్యాంకులు, ప్రభుత్వాల కంట్రోల్ లేనపోవటమే దానికి పాపులారిటీని తెచ్చిపెట్టింది. కానీ భారత్ లాంటి దేశాలు వీటిని పర్యవేక్షణ అవసరమని, దీనిని అసాంఘిక కార్యకలాపాలను వినియోగించకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చింది. క్రిప్టో కరెన్సీల ట్రాన్సాక్షన్స్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీపై జరుగుతున్నందున వాటి సెక్యూరిటీ గురించిన బాధ్యతలు మైనింగ్ చేసిన వ్యక్తులు చూసుకోవాల్సి ఉంటుంది. క్రిప్టో మైనింగ్ చేసే వ్యక్తులు కంప్యూటర్లు అందించే సమస్యలను పరిష్కరించినప్పుడు వారికి బదులుగా బి ట్ కాయిన్స్ ఇవ్వబడతాయి. దీనినే క్రిప్టో మైనింగ్ అని అంటుంటారు. క్రిప్టోల విషయంలో కేవలం ఒక్కరిపైనే పూర్తి బాధ్యత ఉండదు కాబట్టి వీటి విషయంలో అప్రమత్తత అవసరం. కేవలం 2కోట్ల 10 లక్షల బిట్ కాయిన్స్ మాత్రమే మైనింగ్ చేసే అవకాశం ఉంది. సప్లై పరిమితిగా ఉండటం కూడా దీని రేటును అమాంతం పెంచేస్తోందని నిపుణులు చెబుతున్నారు. రోజులో 24 గంటలు ట్రేడింగ్ కి అందుబాటులో ఉండటం కారణంగా దీనిలో ఎక్కువ ఓలటాలిటీ ఉంటుంది. చాలా మంది విదేశాలకు తక్కువ ఖర్చులో డబ్బు పంపటానికి క్రిప్టోలను వినియోగిస్తున్నారు.

## నల్గొండ మైనర్ బాలికపై హత్యాచారం కేసు.. నిందితుడికి ఉరిశిక్ష వేసిన కోర్టు!

- 2013లో 12 ఏళ్ల బాలికపై హత్యాచారానికి పాల్పడ్డ నిందితుడు
- అఘాయిత్యం అనంతరం బాలికను చంపి, మృతదేహాన్ని కాలువలో పడేసిన వైనం
- నిందితుడిపై పోక్సో చట్టం, హత్యా నేరం కింద కేసు నమోదు
- గత పదేళ్లుగా నల్గొండ కోర్టులో వాదనలు
- ఈ రోజు ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చిన న్యాయమూర్తి రోజా రమణి



**హైదరాబాద్ పెన్ పవర్:**మైనర్ బాలికపై హత్యాచారం కేసులో నల్గొండ కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. నిందితుడికి ఉరిశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే... 2013లో నల్గొండకు చెందిన మోహమ్మీ ముకర్రం అనే వ్యక్తి.. 12 ఏళ్ల బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించాడు. అదే అదునుగా ఆ మైనర్ బాలికపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఈ విషయాన్ని బాలిక ఎక్కడ బయటపెడుతుందోనని ఆమెను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని కాలువలో పడేశాడు.నిందితుడు ముకర్రంను అరెస్టు చేసిన నల్గొండ వన్‌టౌన్ పోలీసులు అతనిపై పోక్సో చట్టం, హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుపై గత పదేళ్లుగా జిల్లా కోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఈ రోజు పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి రోజా రమణి నిందితుడికి మరణశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఉరిశిక్షతో పాటు రూ.1.10 లక్షల జరిమానా కూడా విధించారు.

## జైలు నుంచే ప్లాన్..జబల్పూర్‌లో14 కేజీల బంగారం దోపిడీ కేసు.. సంచలన విషయాలు వెలుగులోకి

**హైదరాబాద్ పెన్ పవర్:**మధ్యప్రదేశ్?లోని జబల్పూర్ ప్రైవేట్ బ్యాంకులో 14 కిలోల బంగారం చోరీ కేసులు పోలీసులు ఛేదించారు. గురువారం( ఆగస్టు14) ఈ కేసుకు సంబంధించి కీలక విషయాలను వెల్లడించారు. చోరీకి మొత్తం స్కెచ్ జైలునుంచే జరిగింది..ప్రధాన సూత్రధారి రయీస్ సింగ్ అని పోలీసులు తేల్చారు. ఇటీవల ఒడిశా జైలు నుంచి విడుదలైన రయీస్ సింగ్.. జైలులో ఉండగానే తన సహచరులతో జబల్పూర్ %జుూాఖీ% ఫైనాన్స్ బ్యాంక్ దోపిడీకి ప్లాన్ వేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ ప్లాన్‌అమలు చేసేందుకు రయీస్సింగ్ బీహార్‌కు చెందిన పేరుమోసిన నేరస్థులతో జట్టుకట్టాడు.. తన సహచరుడు సోను బర్మాన్ సహాయంతో ఇంద్రాన గ్రామంలో ఒక గదిని అద్దెకు తీసుకుని రుణ రికవరీ ఏజెంట్‌గా నటిస్తూ వారితో కలిసిపోయాడు..అతను ప్రతిరోజూ బ్యాంకు కదలికలను నిశితంగా గమనించాడని పోలీసులు చెబుతున్నారు. అనుకున్నట్లుగానే సోమవారం (ఆగస్టు 11) పోలీసులను ,భద్రతా వ్యవస్థలను మభ్యపెట్టి కేవలం 20 నిమిషాల్లోనే 14.5 కిలోల బంగారం ,రూ.5 లక్షల నగదుతో తప్పించుకోగలిగారు. గత 10 రోజులుగా 4–5 మంది యువకులు గ్రామంలో నివసిస్తున్నారు..ఎల్లప్పుడూ హెల్మెట్లు ధరించి ఉదయం నుంచి రాత్రి వరకు బైక్‌లపై తిరుగుతున్నారని ఇంద్రాన గ్రామస్థులు చెప్పడంతో గ్రామానికి చెందిన జితేంద్ర ఝరియాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని ఇంట్లో నంబర్ ప్లేట్ లేని బైక్, పిస్టల్,అనుమానాస్పద వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

# హైకోర్టులో వైసీపీకి షాక్.. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికపై సెన్సేషన్ డెసిషన్




**హైదరాబాద్ పెన్ పవర్:**ఏపీ హైకోర్టులో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఉమ్మడి కడప జిల్లాలోని ఈ నెల 12న జరిగిన ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడంతోపాటు రీపోలింగ్ నిర్వహణకు ఆదేశించాలని వైసీపీ వేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల సంఘం విధుల్లో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. మాజీ సీఎం జగన్ సొంత జిల్లాలో రెండు చోట్ల ఘోరంగా ఓడిపోయిన వైసీపీకి హైకోర్టు తీర్పుతో మరింత దెబ్బకొట్టినట్లైంది. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, మళ్లీ రీపోలింగ్ జరగాలని రెండు రోజులుగా వైసీపీ ఆరోపణలు చేస్తోంది. అయితే ఈ విషయంపై నేరుగా హైకోర్టుకు రావడంతో అనుకూల తీర్పు రాలేదని న్యాయవాద వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.పులివెందుల్లో 15 కేంద్రాల్లో, ఒంటిమిట్టలో 30 చోట్ల పోలింగ్ జరిగింది. అయితే మొత్తం అన్ని కేంద్రాల్లోనూ రీపోలింగ్ నిర్వహించాలని వైసీపీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు, రీపోలింగ్ అంశం తమ పరిధిలోది కాదని తేల్చిచెప్పింది. ఎన్నికల సంఘమే దీనిపై నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడింది. ఎన్నికల సంఘం నిర్ణయాల్లో తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.

కాగా, పులివెందుల, ఒంటిమిట్టలో అధికార టీడీపీ ఘన విజయం సాధించింది. పులివెందులలో టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి సుమారు 6 వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఇక్కడ లతారెడ్డి ప్రత్యర్థులు ఎవరూ డిపాజిట్ దక్కించుకోలేకపోయారు. ఒంటిమిట్టలోనూ టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి 6,267 ఓట్ల తేడాతో గెలిచారు. టీడీపీ అభ్యర్థికి 12,780 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి సుబ్బారెడ్డికి 6,513 ఓట్లు వచ్చాయి. ఈ రెండు చోట్ల 11 మంది చొప్పున పోటీపడ్డారు. పులివెందుల, ఒంటిమిట్టలో టీడీపీ అభ్యర్థులు గెలిచినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.అయితే పులివెందుల, ఒంటిమిట్టలో అసలు ఎన్నికలే జరగలేదని వైసీపీ వాదిస్తోంది. తమ ఏజెంట్ల, ఓటర్లను పోలింగ్ బూతుల వద్దకు రానీయకుండా అధికార పార్టీ ఏకపక్షంగా ఓటింగ్ జరుపుకుందని వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. టీడీపీ గెలుపును తాము అంగీకరించమని స్పష్టం చేస్తున్నారు. అధికార పార్టీకి దమ్ముంటే పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ వీడియోలు, పోలింగ్ కేంద్రాల ఆవరణలో సీసీ కెమెరా ఫుటేజ్ బయటపెట్టాలని సవాల్ చేస్తున్నారు. స్థానికుల ఓటరు స్లిప్పులను తీసుకుని టీడీపీ నేతలు దౌర్జన్యంగా ఓటు వేసుకున్నారని ఆరోపించారు. అయితే వీరి వాదనకు కోర్టులో మద్దతు లభించకపోవడంతో ఇప్పుడు ఏం చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు టీడీపీ ఈ విజయాన్ని ఘనంగా చాటుకుంటోంది.

# లక్ష దాటి దూసుకుపోతున్న గోల్డ్.. ఎందుకిలా..? రేట్లు ఇంకా పెరుగుతాయా-తగ్గుతాయా..?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆగస్టు నెల ప్రారంభం నుంచి 24 క్యారెట్ల గోల్డ్ రేటు 10 గ్రాములకు లక్షకు పైనే కొనసాగుతోంది. దీనికి కొన్ని కీలకమైన కారణాలను పరిశీలిస్తే ముందుగా అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడ్ తన వడ్డీ రేట్లను సెప్టెంబరులో తగ్గించవచ్చనే అంచనాలు ఒకటి. దీనికి తోడు అమెరికాలో ద్రవ్యోల్బణం తక్కువగా ఉండటం కూడా డాలర్ రేటును పతనం చేస్తోంది. సాధారణంగా డాలర్ వీక్కైనప్పుడు గోల్డ్ రేట్లు పెరుగుతుంటాయి. ఎందుకంటే సేఫ్ హెవెన్ బంగారానికి ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్ పెరుగుతుంది కాబట్టి.

జూలైలో అమెరికా ద్రవ్యోల్బణం చాలా తక్కువ పెరుగుదలను సూచించటంతో ఈసారి ఫెడ్ సెప్టెంబర్ సమావేశంలో వడ్డీ రేట్లు తగ్గిస్తుందని ఇన్వెస్టర్లు అంచనా వేస్తున్నారు. ఈసారి అది 50 బేసిస్ పాయింట్ల వరకు ఉండొచ్చని వారు అంటున్నారు. ఇదే జరిగితే బాండ్ ఈల్డ్స్ తగ్గుతాయి. దీంతో ఇన్వెస్టర్లు బంగారం వంటి ఇతర పెట్టుబడుల్లోకి తమ డబ్బును పంప్ చేస్తారు. పైగా ప్రస్తుతం టారిఫ్స్ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ట్రేడ్ టెన్షన్స్ పెరుగుతున్న క్రమంలో డాలర్ విలువ కూడా పతనం కావటం బంగారాన్ని మరింత ప్రియంగా మార్చేస్తోందని మెహతా ఈక్విటీస్ నిపుణులు రాహుల్ కలాంత్రి చెప్పారు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంకులు చాలా కాలం నుంచి తమ ఆర్థిక వ్యవస్థలను స్టేబుల్ గా ఉంచేందుకు గోల్డ్ కొనుగోలు చేయటం దీర్ఘకాలికంగా రేట్లలో ర్యాలీకి మరో కారణంగా ఎంకే గ్లోబల్ రీసెర్చ్ అనలిస్ట్ రియా సింగ్ చెప్పారు. 2025లో మ్నెదటి ఆరు నెలల కాలంలోనే సెంట్రల్ బ్యాంకులు ఏకంగా 290 టన్నులు గోల్డ్ కొనుగోలు చేశాయి. ఈ ఏడాది మ్నెత్తం తవ్వి తీసిన బంగారంలో ఇది 15 శాతానికి సమానం అని సింగ్ చెప్పారు. ట్రంప్ టారిఫ్స్ తర్వాత గోల్డ్ ఔన్సు రేటు 3వేల 534 డాలర్ల రికార్డు రేటుకు చేరగా.. ఆగస్టు 15న ట్రంప్ పుతిన్ మధ్య




అలాస్కాలో జరిగే మీటింగ్ పసిడి రేట్ల భవిష్యత్తుకు ఒక ట్రిగర్ అవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే గోల్డ్ రేట్లలో ర్యాలీ ముగియటానికి ఇంకా చాలా దూరం ఉందని నిపుణులు అంటున్నారు. ప్రధానంగా రిటైల్ వినియోగదారుల కంటే పెట్టుబడిదారుల నుంచే ఎక్కువగా బంగారానికి డిమాండ్ ఉండటం రేట్ల పెరుగుదలను ప్రేరేపిస్తోందని రియా సింగ్ అన్నారు. ఒక వేళ ఫెడ్ నిజంగానే రేట్ల తగ్గింపును ప్రకటిస్తే రానున్న కాలంలో ఔన్సు బంగారం రేటు 3వేల 500 డాలర్ల నుంచి 3వేల 600 డాలర్ల మధ్యకు చేరుతుందని అంచనాలను పంచుకున్నారు రియా సింగ్. ప్రస్తుతం గోల్డ్ పై పెట్టుబడులు ఉన్న ఇన్వెస్టర్లు లాభాలు బుక్కింగ్ కోసం ప్రయత్నించటం మంచిదని ఆమె సూచించారు. ఇక కొత్త ఇన్వెస్టర్లు జాగ్రత్తగా గోల్డ్ పెట్టుబడుల విషయంలో ముందుకు సాగటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## పులివెందులపై బాలయ్య రియాక్షన్.. ఎంత మాటో తెలుసా?

**హైదరాబాద్ పెన్ పవర్:** పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక ఫలితంపై టీడీపీ నేత, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యే అయినా, టీడీపీలో మాస్ ఇమేజ్ లీడరు అయినప్పటికీ సహజంగా బాలయ్య పెద్దగా రాజకీయ వ్యాఖ్యలు చేయరు. రొటీన్ పాలిటిక్స్ కు దూరంగా ఉండే బాలయ్య ఎక్కువగా తన సొంత నియోజకవర్గ రాజకీయాలకే పరిమితమవుతారని చెబుతారు. కానీ, పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో ఆయన ప్రత్యేకంగా పొలికల్ కామెంట్స్ చేయడం హాట్ టాపిక్ అవుతోంది.పులివెందులలో టీడీపీ విజయం సాధించడంతో అక్కడి ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని హాట్ కామెంట్ చేశారు బాలయ్య. పులివెందుల గెలుపుపై బాలయ్య ఆనందం వ్యక్తం చేశారు. గత మూడు దశాబ్దాలుగా ఎన్నికలు జరిగిన పరిస్థితి లేదని, కానీ తొలిసారిగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక జరిగిందని బాలయ్య వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నిక జరగలేదన్న వైసీపీ విమర్శలపై స్పందిస్తూ టీడీపీ పాలనలో ప్రజాస్వామ్య యుతంగా ఎన్నిక జరిగిందని అన్నారు.చాలాకాలం తర్వాత ప్రజలు ధైర్యంగా వచ్చి ఓటేశారని చెప్పారు. గతంలో నామినేషన్ వేసే పరిస్థితి కూడా లేదని గుర్తు చేశారు. పులివెందుల వాసులు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారని వ్యాఖ్యానించారు. 11 మంది వచ్చి ధైర్యంగా నామినేషన్ వేయడాన్ని నిజమైన ప్రజాస్వామ్యంగా ఆయన అభివర్ణించారు. కాగా, పులివెందుల ఓట్ల లెక్కింపు సందర్భంగా పలు ఆసక్తికర విశేషాలు బయటకు వచ్చాయి. "30 ఏళ్ల తర్వాత ఓటు వేశాను. అందరికీ దండాలు" అంటూ ఓ ఓటరు చిన్నకాగితంపై రాశాడు. ఈ స్లిప్పు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## ఆరోజు మా వైపే న్యాయం ఉందని ప్రూవ్ చేయగలం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎమ్మెల్సీలు కోదండరాం, అమీర్ అలీ ఖాన్ విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్పందించారు. కోదండరామ్, అమీర్ అలీ ఖాన్ ఎమ్మెల్సీ రద్దు అయినట్లు సగం సమాచారం తో ప్రచారం చేస్తున్నారు.. వాళ్ళ ఇద్దరి విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం గమనిస్తుందన్నారు. పూర్తి వాదనలకు సెప్టెంబర్ 17వ తేదీ నిర్ణయించారు. ఆ రోజు మాకున్న సానుకూల అంశాలు సుప్రీంకోర్టు కు విన్నవిస్తామన్నారు. సెప్టెంబర్ 17న జరిగే ఫైనల్ హిహరింగ్స్‌లో మా వైపే న్యాయం ఉందని ప్రూవ్ చేయగలం అని ధీమా వ్యక్తం చేశారు.

గత గవర్నర్ తప్పు బట్టిన ఖాళీలను రెండు సంవత్సరాలు నింపకుండా మా ప్రభుత్వం ఉండలేదు.. గవర్నర్ కూడా ఉండలేరు.. మా ప్రపోజల్స్ ను గవర్నర్ సానుకూల నిర్ణయం తీసుకున్నారు.. వాళ్ళు ఇద్దరు ఎమ్మెల్సీలుగా అసెంబ్లీ, మండలిలో ప్రమాణ స్వీకారం చేశారు.. సభలో కూడా పాల్గొన్నారు.. వాటి అన్నింటినీ మేము సుప్రీంకోర్టుకు వివరిస్తామన్నారు. సెప్టెంబర్ 17న వెలువరించే తీర్పులో మేము విజయం సాధిస్తామనే నమ్మకం మాకు ఉందన్నారు.గతంలో కేసీఆర్ సరైన నియామకం చేయకపోవడం, సరైన పత్రాలు సమర్పించకపోవడంతో అప్పటి గవర్నర్ తమిళ సై తిరస్కరించారు. మా ప్రభుత్వం కేసీఆర్ లాగ కోర్టుకు వ్యతిరేకంగా కానీ రాజ్యాంగ వ్యతిరేకంగా కానీ ఏ నియామకం చేయలేదు.. ఫైనల్ హియరింగ్ లో మావైపు న్యాయం వస్తుందని నమ్మకం మాకు ఉందన్నారు.

# ఒక గీత.. లక్షల ప్రాణాలు.. 79 ఏళ్లయినా మానని గాయం!

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో, దేశ చరిత్రలో చెరగని విషాదాన్ని మిగిల్చిన 1947 నాటి విభజన గాయాలు మరోసారి గుర్తుకొస్తున్నాయి. లక్షలాది మంది ప్రాణాలను బలిగొని, కోట్లాది మందిని నిరాశ్రయులను చేసిన ఆ విభజన వెనుక ఉన్నది కేవలం ఒక సరిహద్దు రేఖ. దానిపేరే రాడ్‌క్లిఫ్ లైన్. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ గీతను గీసిన వ్యక్తికి భారతదేశంతో ఎలాంటి సంబంధం లేదు. విభజన ప్రక్రియ చేపట్టడానికి ముందు ఆయనెప్పుడూ ఇక్కడికి రాలేదు.

ఐదు వారాల్లో విభజన.. హడావుడి నిర్ణయం

1947 జూన్ 3న మౌంట్‌బాటన్ విభజన ప్రణాళిక ప్రకటించాక, బ్రిటిష్ ప్రభుత్వం భారత్ నుంచి నిష్క్రమించే ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ క్రమంలో పంజాబ్, బెంగాల్ ప్రావిన్సులను విభజించి భారత్, పాకిస్థాన్ మధ్య సరిహద్దును నిర్ణయించే కీలక బాధ్యతను సిరిల్ రాడ్‌క్లిఫ్ అనే లండన్ న్యాయవాదికి అప్పగించారు. ఆయనకు ఈ పని పూర్తి చేయడానికి కేవలం ఐదు వారాల సమయం మాత్రమే ఇచ్చారు. పాతబడిన జనాభా లెక్కలు, తప్పుదారి పట్టించే నివేదికలే ఆయనకు ఆధారం. క్షేత్రస్థాయి వాస్తవాలు, విభిన్న మతాల ప్రజల మధ్య ఉన్న సామాజిక, ఆర్థిక సంబంధాలను ఆయన ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు.

**చరిత్రలోనే అతిపెద్ద విషాదం**

రాడ్‌క్లిఫ్ హడావుడిగా గీసిన ఈ సరిహద్దు రేఖ ఇరు దేశాల ప్రజల జీవితాల్లో పెను విషాదాన్ని నింపింది. ముఖ్యంగా పంజాబ్‌లోని సిక్కు




సమాజం రెండుగా చీలిపోయింది. ముస్లింలు అధికంగా ఉన్న గురుదాస్‌పూర్ జిల్లాను భారత్‌కు కేటాయించడం పాకిస్థాన్‌కు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. స్వాతంత్ర్యం వచ్చిన రెండు రోజుల తర్వాత ఈ విభజన రేఖను అధికారికంగా ప్రకటించడం గందరగోళాన్ని మరింత పెంచింది.దీని పర్యవసానంగా చరిత్రలో కనీవినీ ఎరుగని హింస చెలరేగింది. శరణార్థులతో బయలుదేరిన రైళ్లు సరిహద్దులు దాటేసరికి శవాల దిబ్బలుగా మారాయి. ఈ ఘోరకలిలో మృతుల సంఖ్య అధికారికంగా 2 లక్షల నుంచి 20 లక్షల వరకు ఉంటుందని అంచనా. సుమారు కోటి మందికి పైగా ప్రజలు తమ ఇళ్లు, ఆస్తులను వదిలి నిరాశ్రయులయ్యారు. ఇది 20వ శతాబ్దంలోనే అతిపెద్ద వలసగా నిలిచిపోయింది.

**నేటికీ రగులుతున్న కశ్మీర్**

ఈ విభజన ప్రక్రియ సృష్టించిన అతిపెద్ద, సుదీర్ఘ వివాదం జమ్మూ కశ్మీర్. ముస్లిం జనాభా అధికంగా ఉన్న ఈ సంస్థానం మొదట స్వతంత్రంగా ఉన్నప్పటికీ, పాకిస్థాన్ గిరిజనుల దాడితో అక్కడి హిందూ రాజు భారత్‌లో విలీనం కావాలని నిర్ణయించుకున్నారు. ఇది భారత్, పాకిస్థాన్ మధ్య తొలి యుద్ధానికి దారితీసి, నేటికీ ఇరు దేశాల మధ్య అత్యంత సమస్యాత్మక ప్రాంతంగా మిగిలిపోయింది. 79 ఏళ్లు గడిచినా, రాడ్‌క్లిఫ్ గీసిన గీత ఇరు దేశాల మధ్య వైరాన్ని రగిలిస్తూనే ఉంది. సిరిల్ రాడ్‌క్లిఫ్ తనకు అప్పగించిన పని పూర్తిచేశారు కానీ, ఆ గీత వెంబడి నివసిస్తున్న ప్రజలు మాత్రం తరతరాలుగా దాని మూల్యాన్ని చెల్లిస్తూనే ఉన్నారు.

## భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ ఇంట తీవ్ర విషాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** 1972 మ్యూనిచ్ ఒలింపిక్ గేమ్స్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్న భారత హాకీ జట్టులో సభ్యుడు, టెన్నిస్ లెజెండ్ లియాండర్ పేస్ తండ్రి అయిన మాజీ భారత హాకీ ఆటగాడు వెసీ పేస్ (80) గురువారం మరణించారు.

భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ ఇంట తీవ్ర విషాదం

1972 మ్యూనిచ్ ఒలింపిక్ గేమ్స్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్న భారత హాకీ జట్టులో సభ్యుడు, టెన్నిస్ లెజెండ్ లియాండర్ పేస్ తండ్రి అయిన మాజీ భారత హాకీ ఆటగాడు వెసీ పేస్ (80) గురువారం మరణించారు. మీడియా కథనాల ప్రకారం.. వెస్ పేస్ పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతున్నారు. మంగళవారం ఉదయం ఆయనను కోల్‌కతాలోని ఓ ఆసుపత్రిలో చేర్చారు.

వెస్ పేస్ భారత హాకీ జట్టులో మిడ్‌ఫీల్డర్‌గా ఆడేవారు. ఇది కాకుండా ఆయన ఫుట్‌బాల్, క్రికెట్, రగ్బీ వంటి అనేక క్రీడలకు తన సహకారం అందించారు. వెస్ పేస్ 1996 నుండి 2002 వరకు ఇండియన్ రగ్బీ ఫుట్‌బాల్ యూనియన్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. స్పోర్ట్స్ మెడిసిన్ స్పెషలిస్ట్‌గా ఆయనకు



పేరుంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్, బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా, ఇండియన్ డేవిస్ కప్ జట్టుతో సహా అనేక క్రీడా సంస్థలకు వైద్య సలహాదారుగా పనిచేశారు.1972లో ఒలింపిక్స్‌లో హాకీ జట్టుకు పతకం సాధించిన వెస్ పేస్ కుమారుడు లియాండర్ పేస్ 24 ఏళ్ల తర్వాత 1996లో అట్లాంటా ఒలింపిక్స్‌లో భారత టెన్నిస్‌కు తొలి ఏకైక పతకాన్ని అందించాడు. పురుషుల సింగిల్స్‌లో లియాండర్ కాంస్య పతకాన్ని సాధించాడు. 1952 తర్వాత ఒలింపిక్ వ్యక్తిగత క్రీడల్లో భారత్‌కు ఇదే తొలి పతకం. 1952లో %ఖఱ% జాదవ్ రెజ్లింగ్‌లో పతకం గెలిచాడు. వెస్ తన కొడుకు లియాండర్‌ను ఎప్పుడూ మెచ్చుకునేవారు. ఈ ఇద్దరు తండ్రీ కొడుకుల మధ్య అనుబంధం చాలా లోతైనది.

# పాకిస్థాన్ లోని కీలక సహజ వనరులపై కన్నేసిన అమెరికా!



**హైదరాబాద్ పెన్ పవర్:**దక్షిణాసియాలో తన వ్యూహాత్మక ప్రయోజనాల కోసం అమెరికా మరోసారి పాకిస్థాన్ వైపు దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. పాకిస్థాన్‌లోని సహజ వనరులు, ముఖ్యంగా కీలక ఖనిజాలు, హైడ్రోకార్బన్‌ల వెలికితీతలో సహకరించేందుకు అమెరికా ఆసక్తి చూపడం ఈ వాదనలకు బలం చేకూరుస్తోంది. పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికా చేసిన ప్రకటన, అగ్రరాజ్య అసలు లక్ష్యాలకు అద్దం పడుతోంది.పాకిస్థాన్ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా (ఆగస్టు 14) ఆ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఆర్థిక సహకారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. “కీలక ఖనిజాలు, హైడ్రోకార్బన్‌ల వంటి కొత్త రంగాల్లో ఆర్థిక సహకార అవకాశాలను అన్వేషించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. ఇరు దేశాల ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వ్యాపార భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తాం” అని ఆయన తన సందేశంలో స్పష్టం చేశారు. అయితే, పాక్ సహజ వనరులపై అమెరికా ఆసక్తి చూపడం ఇదే మొదటిసారి కాదు. కొంతకాలం కిందటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్థాన్‌లోని చమురు నిల్వలపై దృష్టి సారించారు. పాక్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిందని, ఆ దేశంలోని చమురు నిల్వల అభివృద్ధికి ఓ అమెరికన్ కంపెనీని ఎంపిక చేసే ప్రక్రియలో ఉన్నామని ట్రంప్ తెలిపారు. భవిష్యత్తులో పాకిస్థాన్... భారత్‌కు చమురు విక్రయించే స్థాయికి ఎదుగుతుందని ఆయన అప్పట్లో వ్యాఖ్యానించారు.కానీ, వాస్తవ గణాంకాలు ట్రంప్ వ్యాఖ్యలకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ప్రపంచ చమురు నిల్వల్లో పాకిస్థాన్ వాటా కేవలం 0.02 శాతం మాత్రమే. రాయిటర్స్ నివేదిక ప్రకారం, పాక్‌లో చమురు నిల్వలు 234 మిలియన్ల నుంచి 353 మిలియన్ బ్యారెళ్ల మధ్య ఉన్నాయి. ఈ లెక్కన ప్రపంచంలో పాక్ 50వ స్థానంలో ఉంది. ఈ స్వల్ప నిల్వలతో పాకిస్థాన్ గణనీయమైన చమురు ఎగుమతిదారుగా మారే అవకాశం దాదాపు అసాధ్యం.

మరోవైపు, వాణిజ్య విషయంలో ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై కఠినంగా వ్యవహరిస్తూ, పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉండటం గమనార్హం. దక్షిణాసియాలో పాక్ వస్తువులపై కేవలం 19 శాతం సుంకం విధిస్తుండగా, భారత్‌పై 25 శాతం సుంకం విధించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అదనంగా మరో 25 శాతం సుంకం విధించడంతో భారత్‌పై మొత్తం సుంకం 50 శాతానికి చేరింది. అమెరికా నిర్ణయాన్ని భారత విదేశాంగ శాఖ “అన్యాయం, అసమంజసం” అని తీవ్రంగా విమర్శించింది. ఈ పరిణామాలన్నీ గమనిస్తే, సహజ వనరుల కోసమే అమెరికా పాకిస్థాన్‌కు దగ్గరవుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# జమ్ము కశ్మీర్ లో క్లౌడ్ బరస్ట్ పై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

- జమ్మూ కశ్మీర్ కిష్త్వార్‌లో ఆకస్మిక వరదలు
- ఘటనలో 38 మంది దుర్మరణం, 100 మందికి గాయాలు
- ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి
- రంగంలోకి దిగిన సైన్యం, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు
- క్షతగాత్రులను హెలికాప్టర్ల ద్వారా ఆసుపత్రులకు తరలింపు
- బాధితులకు అన్ని విధాలా సాయం అందిస్తామని ప్రధాని హామీ



**హైదరాబాద్ పెన్ పవర్:**జమ్మూ కశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో గురువారం సంభవించిన క్లౌడ్ బరస్ట్ (కుంభవృష్టి), ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘోర విపత్తులో 38 మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని ప్రధాని భరోసా ఇచ్చారు. “కిష్త్వార్ వరద బాధితులందరికీ సానుభూతి తెలియజేస్తున్నాను. వారికోసం ప్రార్థిస్తున్నాను. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అవసరమైన ప్రతి సహాయాన్ని అందిస్తాం” అని ప్రధాని మోదీ ‘ఎక్స్’ వేదికగా పేర్కొన్నారు.

కిష్త్వార్ జిల్లాలోని మారుమూల ప్రాంతంలో ఈ విపత్తు సంభవించడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ ఘటనలో సుమారు 100 మందికి పైగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. ఆ ప్రాంతం అత్యంత దుర్గమంగా ఉండటంతో, క్షతగాత్రులను హెలికాప్టర్ల ద్వారా సమీపంలోని ఆసుపత్రులకు తరలిస్తున్నారు.సమాచారం అందిన వెంటనే సైన్యం, జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్), రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్) బృందాలు స్థానిక యంత్రాంగంతో కలిసి రంగంలోకి దిగాయి. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వైద్య సహాయం అందించడం వంటి పనులను ముమ్మరంగా చేపట్టాయి. ప్రస్తుతం సహాయక కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి.

# డిస్ట్రిబ్యూషన్ పేరిట రూ.5.41 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లో సైబర్ నేరగాళ్లు ఓ కొత్త తరహా మోసానికి పాల్పడ్డారు. ఓ కంపెనీ డిస్ట్రిబ్యూషన్ ఇస్తామని నమ్మించి రూ.5.41 లక్షలు కాజేశారు. పాతబస్తీలోని చుడీ బజార్‌కు చెందిన ఓ వ్యక్తి బిర్లా పెయింట్ డిస్ట్రిబ్యూషన్ కోసం ఆన్‌లైన్‌లో వెతికాడు. దీన్ని గమనించిన సైబర్ నేరగాళ్లు, ఓపస్ బిర్లా పెయింట్ డిస్ట్రిబ్యూషన్ ఇస్తామని నమ్మించేలా ఫోన్ నెంబర్, ఇతర వివరాలు ఇచ్చారు.

బాధితుడు ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా, డిస్ట్రిబ్యూటర్‌గా రిజిస్ట్రేషన్, డెలివరీ, ఇతర ఖర్చుల పేరుతో రూ.5.41 లక్షలు తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. ఆ తర్వాత ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సింధు జలాల ఒప్పందంపై కీలక ప్రకటన.. కోర్టు తీర్పు చెల్లదన్న భారత్

**హైదరాబాద్ పెన్ పవర్:**సింధు జలాల ఒప్పందం విషయంలో అంతర్జాతీయ మధ్యవర్తిత్వ న్యాయస్థానం వెలువరించిన తీర్పును భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ తీర్పునకు ఎటువంటి చట్టబద్ధత లేదని, దానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం తమకు లేదని గురువారం స్పష్టం చేసింది. పాకిస్థాన్ ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్నందున సింధు జలాల ఒప్పందాన్ని ఇప్పటికే తాత్కాలికంగా నిలిపివేసినట్లు భారత ప్రభుత్వం పునరుద్ఘాటించింది.ఈ విషయంపై న్యూఢిల్లీలో విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడారు. హేగ్ కేంద్రంగా పనిచేస్తున్న మధ్యవర్తిత్వ న్యాయస్థానం ఏర్పాటును, దాని చట్టబద్ధతను భారత్ ఎప్పుడూ గుర్తించలేదని ఆయన తేల్చిచెప్పారు. “ఆ కోర్టు ఇచ్చిన తీర్పులకు అధికార పరిధి లేదు, చట్టపరమైన విలువ లేదు. జలాల వినియోగంపై మా హక్కులను ఆ తీర్పులు ఏమాత్రం ప్రభావితం చేయలేవు. ఈ విషయంలో పాకిస్థాన్ తప్పుదోవ పట్టించేలా చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం” అని జైస్వాల్ అన్నారు.జమ్మూకశ్మీర్‌లోని కిషన్‌గంగ, రాట్లే జల విద్యుత్ ప్రాజెక్టులపై ఈ కోర్టు జూన్‌లో ఒక అనుబంధ తీర్పు ఇచ్చింది. అయితే, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రతిస్పందనగానే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ సార్వభౌమ నిర్ణయం తీసుకున్నట్లు భారత్ వివరించింది. ఒప్పందం అమలులో లేనప్పుడు, దాని కింద వచ్చే బాధ్యతలను పాటించాల్సిన అవసరం లేదని, అక్రమంగా ఏర్పడిన మధ్యవర్తిత్వ కోర్టుకు తమ దేశ సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించే హక్కు లేదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.అంతర్జాతీయ వేదికలను తప్పుదోవ పట్టించడం పాకిస్థాన్‌కు అలవాటుగా మారిందని, ఉగ్రవాదానికి కేంద్రంగా ఉన్న తన పాత్ర నుంచి ప్రపంచ దృష్టిని మళ్లించేందుకే పాక్ ఇలాంటి కల్పిత మధ్యవర్తిత్వ నాటకాలకు పాల్పడుతోందని భారత్ ఆరోపించింది.

## భారీ వర్షాలు.. బేగంబజారులో కుప్పకూలిన పురాతన భవనం

- ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం
- భవనం శిథిలావస్థకు చేరుకుందని గతంలోనే నోటీసులు జారీ చేసిన జీహెచ్ఎంసీ
- నోటీసులు పట్టించుకోని యజమాని



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలోని బేగంబజార్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఒక పురాతన భవనం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ భవనం శిథిలావస్థకు చేరుకున్నందున దానిని కూల్చివేయాలని జీహెచ్ఎంసీ అధికారులు గతంలోనే భవనం యజమానికి నోటీసులు జారీ చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ యజమాని పట్టించుకోలేదు. బేగంబజారులో ఇప్పటికీ చాలా మంది వ్యాపారులు ఇలాంటి పురాతన భవనాల్లోనే దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో రద్దీ ఎక్కువగా ఉండటంతో శిథిలావస్థకు చేరుకున్న భవనాలను తొలగించాలని స్థానికులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు.

## బ్లడ్ షుగర్ కంట్రోల్ చేసే 4 సూపర్ ఫుడ్స్! నిపుణుల సలహా ఇదే

**హైదరాబాద్ పెన్ పవర్:**మారుతున్న జీవనశైలి కారణంగా ప్రపంచవ్యాప్తంగా డయాబెటిస్ (మధుమేహం) సమస్య వేగంగా పెరుగుతోంది. అయితే సరైన ఆహార నియమాలు, వ్యాయామం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల ఆహార పదార్థాలు డయాబెటిస్‌ను నియంత్రించడంలో అద్భుతంగా పనిచేస్తాయని సూచిస్తున్నారు. షుగర్ నియంత్రణకు సహాయపడే నాలుగు కీలక ఆహారాల గురించి వివరించారు.

**ఆహారమే ఔషధం**

టైప్ 2 డయాబెటిస్ ప్రధానంగా ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు వంటి కారణాలతో వస్తుంది. దీనిని నియంత్రించకపోతే గుండె, కిడ్నీ జబ్బులు, నరాల బలహీనత వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అయితే, ఆహారంలో కొన్ని మార్పులు చేయడం ద్వారా ఇన్సులిన్ పనితీరును మెరుగుపరిచి, మందులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. వారు సూచించిన ఆ నాలుగు ఆహారాలు ఇవే.

**1. బీన్స్**

బీన్స్‌లో ఫైబర్, మొక్కల ఆధారిత ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి తిన్న వెంటనే రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా చూస్తాయి. దీనిలోని ఫైబర్ జీర్ణక్రియను నెమ్మది చేస్తుంది, ఫలితంగా గ్లూకోజ్ నెమ్మదిగా రక్తంలో కలుస్తుంది. అంతేకాకుండా, ఇందులో ఉండే మెగ్నీషియం ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది. రాజ్మా, శనగలు, బ్లాక్ బీన్స్ వంటి వాటిని సూప్‌లు, సలాడ్లలో చేర్చుకోవచ్చు.


**2. బ్రకోలీ**

బ్రకోలీలో ఉండే 'సల్ఫోరాఫేన్' అనే సమ్మేళనం ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచి, రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇందులో ఉండే క్రోమియం, శరీరంలో ఇన్సులిన్ వినియోగాన్ని మెరుగుపరుస్తుంది. అధిక ఫైబర్, తక్కువ కార్బోహైడ్రేట్లు ఉండటం వల్ల షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. బ్రకోలీని ఉడకబెట్టి లేదా కూరల్లో వాడుకోవచ్చు.

**3. ఎడమామె**

ఎడమామె (పచ్చి సోయా చిక్కుళ్లు)లో ప్రోటీన్, ఫైబర్, ఐసోఫ్లేవోన్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుతాయి. వీటిని ఉడకబెట్టుకుని స్నాక్‌గా లేదా సలాడ్లలో తినవచ్చు.

# బెయిల్ రద్దు చేసిన సుప్రీంకోర్టు... దర్శన్, పవిత్ర గౌడ మళ్లీ అరెస్ట్





**హైదరాబాద్ పెన్ పవర్:**అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్, ఆయన స్నేహితురాలు పవిత్ర గౌడలకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో వారికి గతంలో మంజూరైన బెయిల్‌ను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేయడంతో, బెంగళూరు పోలీసులు వీరిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామం కన్నడ చిత్ర పరిశ్రమలో మరోసారి కలకలం రేపింది.

సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన కొన్ని గంటల వ్యవధిలోనే పోలీసులు రంగంలోకి దిగారు. మొదట పవిత్రా గౌడను ఆమె నివాసంలో అరెస్ట్ చేయగా, అనంతరం హొసకెరెహళ్లిలోని భార్య ఇంట్లో ఉన్న దర్శన్‌ను అదుపులోకి తీసుకున్నారు. మీడియా కంటపడకుండా ఉండేందుకు దర్శన్ వెనుక గేటు నుంచి ఇంట్లోకి వెళ్లినట్లు తెలిసింది. గతేడాది డిసెంబరులో కర్ణాటక హైకోర్టు దర్శన్, పవిత్రలకు బెయిల్ మంజూరు చేయగా, దీనిని రాష్ట్ర పోలీసులు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన సర్వోన్నత న్యాయస్థానం, బెయిల్‌ను రద్దు చేస్తూ, కేసు విచారణను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి అనే యువకుడు, పవిత్రా గౌడకు సోషల్ మీడియాలో అసభ్యకరమైన సందేశాలు పంపాడనే ఆరోపణలతో ఈ దారుణ హత్య జరిగింది. అతడిని కిడ్నాప్ చేసి, చిత్రహింసలకు గురిచేసి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. బాధితుడికి కరెంట్ షాక్ ఇచ్చినట్లు కూడా పోస్టుమార్టం నివేదికలో వెల్లడవడంతో ఈ కేసు తీవ్రత బయటపడింది. ఈ కేసులో దర్శన్, పవిత్రలతో కలిపి మొత్తం 15 మంది నిందితులుగా ఉన్నారు.

# అక్టోబర్ 1 నుంచి యూపీఐలో ఈ ఫీచర్ కనుమరుగు.. ఎందుకంటే?

- యూపీఐ యాప్‌లలో 'కలెక్ట్ రిక్వెస్ట్' ఫీచర్ రద్దు
- అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు అమలు
- ఆర్థిక మోసాలను అరికట్టేందుకే ఈ కీలక నిర్ణయం
- ఆదేశాలు జారీ చేసిన నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
- డబ్బు పంపాలంటే క్యూఆర్ కోడ్ లేదా ఫోన్ నంబర్ తప్పనిసరి




**హైదరాబాద్ పెన్ పవర్:**మీరు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యూపీఐ యాప్‌లను నిత్యం వాడుతున్నారా? అయితే మీకో ముఖ్యమైన సమాచారం. ఆన్‌లైన్ మోసాలను నివారించేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఒక కీలక నిర్ణయం తీసుకుంది. యూపీఐ యాప్‌లలో విస్తృతంగా ఉపయోగించే 'కలెక్ట్ రిక్వెస్ట్' లేదా పీర్-టు-పీర్ (%ూ2ూ%) మనీ రిక్వెస్ట్ ఫీచర్‌ను పూర్తిగా తొలగించనుంది. ఈ నూతన నిబంధన ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానుంది.

**ఎందుకీ మార్పు?**

స్నేహితులు లేదా ఇతరుల నుంచి డబ్బులు స్వీకరించాల్సిన సమయంలో, వారికి రిమైండర్ పంపేందుకు 'కలెక్ట్ రిక్వెస్ట్' ఫీచర్ ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే, సైబర్ నేరగాళ్లు ఇదే ఫీచర్‌ను ఆసరాగా చేసుకొని అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. ఏదో ఒక అత్యవసర పరిస్థితి లేదా నకిలీ కారణం చూపి యూజర్లకు మనీ రిక్వెస్ట్‌లు పంపుతున్నారు. విషయం తెలియక చాలామంది ఆ రిక్వెస్ట్‌ను ఆమోదించి, తమ యూపీఐ పిన్ ఎంటర్ చేసి డబ్బులు నష్టపోతున్నారు. ఇలాంటి ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేయడానికే ఎన్‌పీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో ఈ తరహా లావాదేవీలపై రూ. 2,000 పరిమితి విధించినప్పటికీ మోసాలు ఆగలేదు. అందుకే, వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ ఫీచర్‌నే పూర్తిగా తొలగించాలని జూలై 29న జారీ చేసిన సర్క్యులర్‌లో ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది.

**ఇకపై డబ్బు పంపడం ఎలా?**

అక్టోబర్ 1 నుంచి వ్యక్తుల మధ్య డబ్బును అభ్యర్థించే 'కలెక్ట్ రిక్వెస్ట్' ఆప్షన్ పనిచేయదు. వినియోగదారులు నేరుగా అవతలి వ్యక్తి ఫోన్ నంబర్‌ను ఎంచుకొని లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి మాత్రమే డబ్బులు పంపాల్సి ఉంటుంది. ఇది సురక్షితమైన పద్ధతి అని ఎన్‌పీసీఐ భావిస్తోంది.

**వ్యాపార సంస్థలకు మినహాయింపు**

అయితే, ఈ కొత్త నిబంధన వ్యాపార లావాదేవీలకు వర్తించదు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, స్విగ్గీ, ఐఆర్‌సీటీసీ వంటి సంస్థలు తమ కస్టమర్లకు పేమెంట్ పూర్తిచేయమని కలెక్ట్ రిక్వెస్ట్‌లు పంపవచ్చు. వినియోగదారులు ఆ రిక్వెస్ట్‌ను ఆమోదించి, తమ యూపీఐ పిన్‌ను ఎంటర్ చేయడం ద్వారా చెల్లింపులు పూర్తి చేయవచ్చు. ఈ విషయంలో ఎలాంటి మార్పు ఉండదని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది.